ఇస్లాంలో నా మొదటి రోజు (కథా మాలిక) 2

నేను నమాజు ఎలా చేయాలి?

ఈ గొప్ప ఆరాధనను నిర్వహించడానికి మార్గదర్శకాలు

నేను నమాజు ఎలా చేయాలి?

ఈ గొప్ప ఆరాధనను నిర్వహించడానికి మార్గదర్శకాలు

مركز أصول
OsoulCenter

ⓗ **جمعية الدعوة والإرشاد وتوعية الجاليات بالربوة ، ١٤٤٦ هـ**

مركز أصول

كيف أصلي: شرح مصور لكيفية الصلاة مع وقفات مع هذه الشعيرة العظيمة باللغة التلغو. / مركز أصول - ط ١. .- الرياض ، ١٤٤٦ هـ

٥٠ ص ؛ ١٤.٨ x ٢١ سم

رقم الإيداع: ١٤٤٦/١٨٩٧٧

ردمك: ٦-٩١-٨٤٣٨-٦٠٣-٩٧٨

مركز أصول
Osoul Center
www.osoulcenter.com

- ఈ ప్రచురణను ఒసూల్ సెంటర్ రూపొందించింది మరియు రూపకల్పన చేసింది.
- సెంటర్ ఈ ప్రచురణను ఏ విధంగానైనా ముద్రించడానికి మరియు ప్రచురించడానికి అనుమతిస్తుంది, అయితే మూలాన్ని సూచించడంతోపాటు అసలు వచనం(టెక్స్ట్)లో ఎటువంటి మార్పులు చేయకపోవడం వంటి నిబంధనలకు లోబడి ఉంటుంది.
- ముద్రణ విషయంలో, ఒసూల్ సెంటర్ ఆమోదించిన నాణ్యత ప్రమాణాలకు కట్టుబడి ఉండవలసి ఉంటుంది.

بسم الله الرحمن الرحيم

అనంత కృపాశీలుడు, అపార కరుణామయుడైన అల్లాహ్ పేరుతో

ముందుమాట

మనిషికి, అతని ప్రభువుకు మధ్య ఉన్న అత్యుత్తమ అనుబంధాలలో ఒకటి ఈ నమాజు. ఇది ఒక గొప్ప ఆరాధన. దీనిలో మనిషి అల్లాహ్ ఎదుట నిలబడి, ఆయన ఆదేశించిన విధంగా ఆయనను ఆరాధిస్తాడు. ఔన్నత్యం మరియు వినయంతో ఆయనను స్మరిస్తాడు. ప్రేమ, భయం, ఆశతో ఆయనను ప్రార్థిస్తాడు.

నమాజులో ఎన్నో గొప్ప ప్రయోజనాలు ఉన్నాయి. ఇది ఇస్లాం యొక్క రెండవ మూల స్తంభం. విశ్వాస ప్రకటన (షహాదా) తర్వాత అత్యుత్తమ ఆచరణ ఇది. స్వర్గానికి ప్రవేశించడానికి గల అతి ముఖ్య కారణాలలో ఒకటి.

దీని ద్వారా అల్లాహ్ స్థాయిలను పెంచుతాడు. పాపాలు మరియు చెడులను తొలగిస్తాడు. దీనికోసం నడిచి వెళ్ళేటపుడు పుణ్యాలు వ్రాయబడతాయి. విశ్వాసి దీనిని ఆచరించడానికి వెళ్ళిన ప్రతిసారీ స్వర్గంలో అతని కోసం ఆతిథ్యం ఏర్పాటు చేయబడుతుంది.

నమాజు చేసే స్థలంలో ఉన్నంత వరకు దైవదూతలు అతని కోసం వేడుకుంటారు. ఒక నమాజుకు, తదుపరి నమాజుకు మధ్య ఉన్న సమయంలోని పాపాలను అల్లాహ్ క్షమిస్తాడు. నమాజు అనేది ఇహలోకంలో మరియు పరలోకంలో అతనికి ఒక వెలుగు. ఇతర ఆరాధనల కన్నా దీనికి ఎన్నో గొప్ప ప్రతిఫలాలు, ప్రయోజనాలు ఉన్నాయి. దీనికి నిదర్శనం ఏమిటంటే, ఇది దైవదూత జిబ్రాయిల్

(అలైహిస్సలాం) ద్వారా కాకుండా నేరుగా అల్లాహ్ ద్వారా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారికి విధిగావించబడినది. ఇది ఈ భూమిపై కాకుండా, ఇస్రా మరియు మేరాజ్ యాత్రలో స్వర్గంలో విధిగావించబడినది.

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "(ఓ ప్రవక్తా!) నీకు ఈ గ్రంథంలో దివ్యవాణిగా అందించబడిన దానిని పఠించు మరియు నమాజు ను స్థాపించు. నిశ్చయంగా నమాజు అశ్లీలత నుండి, చెడు విషయాల నుండి ఆపుతుంది. మరియు నిశ్చయంగా అల్లాహ్ ను స్మరించడం అనేది చాలా గొప్ప విషయం(అన్న సంగతిని మరువరాదు). మరియు మీరు ఏమి చేస్తున్నారో అల్లాహ్ కు తెలుసు." (ఖుర్ఆన్ 29:45)

జాబిర్ (రజియల్లాహు అన్హు) ఇలా సెలవిస్తున్నారు: దైవప్రవక్త(సల్లల్లాహు అలైహి వసల్లం) వారు నమాజును ఇలా పోల్చారు : "ఐదు నమాజాలు మీ ఇంటి ముందు ప్రవహించే నది లాంటివి. ప్రతిరోజు ఐదుసార్లు మీరు దానిలో స్నానం చేస్తారు." (ముస్లిం)

విషయసూచిక

విషయం | పేజీ నెంబరు

1	నమాజు లో హృదయం మరియు శరీర అవయవాల ఏకాగ్రత	9
2	విధిగా చేయవలసిన నమాజులు	13
3	నమాజు యొక్క కొన్ని నియమాలు	15
4	నేను నమాజు ఎలా చేయాలి?	17
5	నమాజును భంగ పరిచే అంశాలు	32
6	నమాజులో మక్రూహ్ అయినవి	33
7	రోగి యొక్క నమాజు	35
8	ప్రయాణికుడి నమాజు	36
9	స్త్రీలకు సంబంధించిన నమాజు నియమాలు	37
10	అభ్యాస ప్రశ్నలు	40

నమాజులో హృదయం మరియు శరీర అవయవాల వినమ్రత మరియు అణకువ(ఖుషూ).

నమాజులో ఖుషూ అనేది దానికి ప్రాణం వంటిది. ఇది మనసులోని భక్తి, వినయం, మరియు అల్లాహ్ పట్ల ఉన్న గౌరవం నుండి పుడుతుంది. నమాజ్ చేస్తున్నప్పుడు మన మనస్సు పూర్తిగా అల్లాహ్‌తోనే ముడిపడి ఉండాలి. ఇతర ఆలోచనలకు తావు ఇవ్వకూడదు. అప్పుడే మన శరీరం కూడా ప్రశాంతంగా ఉండి అనవసర కదలికలు చేయకుండా ఉండగలుగుతాము.

ఖుషూ(అణకువ, వినమ్రత) విషయంలో నిర్లక్ష్యం వహిస్తే నమాజు యొక్క ప్రతిఫలం తగ్గుతుంది. అది పాపానికి కూడా దారితీయవచ్చు. దైవప్రవక్త (స) వారు ఇలా సెలవిచ్చారు: “వాస్తవానికి ఒక వ్యక్తి నమాజు చేస్తాడు, కానీ అతనికి దానిలో పదోవంతు, తొమ్మిదో వంతు, ఎనిమిదో వంతు, ఏడో వంతు, ఆరో వంతు, ఐదో వంతు, నాలుగో వంతు, మూడో వంతు, సగం మాత్రమే వ్రాయబడుతుంది.”(అహ్మద్)

అణకువ సాధించడానికి సహాయపడేవి:

1. అల్లాహ్ ను అణకువ ప్రసాదించమని వేడుకోవడం.
2. నమాజుకు ముందు మనసులోని చింతలను తొలగించడం.
3. సుగంధ ద్రవ్యాలు పూసుకోవడం, నమాజుకు తగిన దుస్తులు ధరించడం.
4. వీలైతే ఇంట్లోనే వుదూ చేయడం, వుదూను పరిపూర్ణంగా చేయడం.
5. దుర్వాసనలకు దూరంగా ఉండటం, దుస్తుల నుండి, నోటి నుండి వాటిని తొలగించడం.
6. నమాజు సమయంలో ఆహారం వడ్డించి ఉన్నట్లయితే, ముందుగా భోజనం చేయాలి. దీని వల్ల నమాజు చేస్తున్నప్పుడు మనసు ఆహారం వైపు మళ్ళకుండాఉంటుంది.

7 మలమూత్ర విసర్జనకు వెళ్లవలసిన అవసరం తీవ్రంగా ఉన్నప్పుడు నమాజు చేయకూడదు. ముందుగా వాటిని పూర్తి చేసుకోవాలి. దీని వల్ల అణకువ, ప్రశాంతత చెడిపోకుండా ఉంటుంది.

8 మస్జిదుకు వెళ్ళేటపుడు ప్రశాంతంగా, గంభీరంగా నడవాలి. మస్జిదులో నమాజు ప్రారంభమైపోయినప్పటికీ పరిగెత్తకూడదు. ఎందుకంటే తొందరపాటు అనేది మనసు యొక్క ఏకాగ్రతను చెదరగొడుతుంది.

9 ఇంటి నుండి బయలుదేరేటప్పుడు, మస్జిదుకు నడుస్తున్నప్పుడు మరియు మస్జిదులోకి ప్రవేశించేటప్పుడు చదవవలసిన స్మరణల(దిక్ర్)ను మరియు దుఆలను చదవడం.

10 మస్జిదులోకి ప్రవేశించిన తర్వాత రెండు రెకాతుల తహియ్యతుల్ మస్జిద్ (మస్జిదుకు గౌరవ సూచకంగా చేయబడే నమాజు) నమాజు చేయడం. దీనికి బదులుగా సున్నత్ నమాజు కూడా సరిపోతుంది.

11 నమాజు ప్రారంభం కోసం ఎదురు చూస్తున్నప్పుడు అల్లాహ్ ను స్మరించడం. తోటివారితో ప్రాపంచిక సంబంధమైన విషయాల గురించి మాట్లాడకపోవడం.

విధిగా ఆచరించవలసిన నమాజులు:

ముస్లిములపై అల్లాహ్ పగలు మరియు రాత్రిలో ఐదు నమాజులను విధిగా చేశాడు. ఇవి షరియా (ఇస్లామీయ ధార్మిక నియమావళి) నిర్ణయించిన నిర్దిష్ట సమయాల్లోనే ఉంటాయి.

వాటి క్రమం: ఫజ్ర్ నమాజు, దుహర్ నమాజు, అసర్ నమాజు, మగ్రిబ్ నమాజు, ఇషా నమాజు. వీటిలో ప్రతిదానికి నిర్దిష్ట సంఖ్యలో రెకాతులు ఉంటాయి. వాటిని తప్పనిసరిగా పూర్తి చేయడం ద్వారా మాత్రమే అవి చెల్లుబాటు అవుతాయి. అలాగే ప్రతి నమాజుకు ఒక నిర్దిష్ట సమయం ఉంటుంది, దానిలో అవి నిర్వర్తించబడాలి. ఈ సమయాన్ని ప్రవక్త (స) హదీసులలోని కొన్ని సంకేతాల ద్వారా తెలుసుకోవచ్చు. విశ్వసనీయ గడియారాల ద్వారా లేదా ప్రతి నమాజు సమయానికి ఇవ్వబడే అజాన్ ద్వారా కూడా సమయాన్ని తెలుసుకోవచ్చు.



నమాజు యొక్క కొన్ని నియమాలు:

1. ఎన్ని పాపాలు చేసి ఉన్నా కూడా ఒక ముస్లిము నమాజును మానకూడదు. ఎందుకంటే నమాజు పూర్తిగా విడిచిపెట్టిన వ్యక్తి ముస్లిము కాజాలడు.

2. పురుషులు మస్జిదులో సామూహికంగా నమాజు చేయడం అనేది ప్రధాన నియమం. సామూహికంగా(జమాత్) చేసే నమాజుకు ఒంటరిగా చేసే నమాజు కంటే ఎక్కువ ప్రతిఫలం ఉంటుంది. ఇళ్ళు, రోడ్లు, మైదానాలు వంటి ఏ పరిశుభ్రమైన స్థలంలోనైనా నమాజు చేయవచ్చు.

3. ముస్లిం తన మర్మావయవాలను కప్పి ఉంచాలి. శుద్ధత కలిగి ఉన్నప్పుడు మాత్రమే నమాజులోకి ప్రవేశించాలి. వుదూ ఎలా చేయాలో తెలియని వ్యక్తి దానిని నేర్చుకోవాలి.

4. నమాజు చేసే వ్యక్తి ఇమామ్ గా లేదా ఒంటరిగా ఉన్నట్లయితే, అతని ముందు ఒక సుత్రా ఉంచుకోవడం మంచిది. దీని అర్థం అతని ముందు ఒక అడ్డు ఉంచడం. దీని వల్ల అతని ముందు నుండి ఎవరైనా వెళ్ళినప్పుడు అతని దృష్టి దానివైపు మరలదు.

అదనపు సమాచారం: (శుద్ధత(తహారా)అంటే: వుదూ చేయడం, శరీరం యొక్క పరిశుభ్రత కలిగి ఉండడం మరియు నమాజు చేసే స్థలం నుండి మలినాలను తొలగించడం)

అదనపు సమాచారం: నమాజు చెల్లుబాటు కావడానికి కొన్ని షరతులు ఉన్నాయి, అవి: శుద్ధత, నియ్యత్(సంకల్పం), ఖిబ్లా వైపు తిరగడం, ఆ విధి నమాజుకు చెందిన సమయం ప్రవేశించడం.

నేను ఎలా నమాజు చేయాలి?

నమాజు ఎలా చేయాలో చిత్రాల ద్వారా ఆచరణాత్మక వివరణ

నాలుగు రెకాతుల నమాజు ఎలా చేయాలి?

దుహర్, అసర్, ఇషా నమాజులు ఎలా చేయాలో చిత్రాలతో వివరణ

1 ఖిబ్లా వైపు తిరగడం: ఇది మక్కా యొక్క దిశ. మనం ఖచ్చితంగా కాబా వైపు తిరిగి ఉండాలని షరతు లేదు. ఆ దిశలో ఉంటే సరిపోతుంది.

2 నియ్యత్: మన హృదయంలో నియ్యత్(సంకల్పం) చేసుకుంటాము - నోటితో చెప్పాల్సిన అవసరం లేదు - అంటే, మనం ఏ నమాజు సమయం వచ్చిందో ఆ నమాజు చేస్తున్నామని మన మనస్సుతో గ్రహిస్తాము.

3 తక్బీరతుల్ ఇహ్రామ్ (నమాజును ప్రారంభించే తక్బీర్):

A. మన చేతులను భుజాల ఎముకల వరకు లేదా చెవుల వరకు పైకెత్తుతాము. మన అరచేతులను ఖిబ్లా వైపుకు తిప్పిఉంచి, “అల్లాహు అక్బర్” అని అంటాము. దీనిని తప్పకుండా నోటితో చెప్పాలి.

B. తక్బీర్ తర్వాత, కుడి చేతిని ఎడమ చేతిపై ఉంచడం సున్నత్. రెండు చేతులు ఛాతీపై, బొడ్డు పైన కూడా ఉంచవచ్చు. మనకు ఏది సులభమో అలా చేయవచ్చు.

C. నమాజులో మనం సజ్దా చేసే స్థలం వైపు చూడాలి. మన దృష్టిని ఆకాశం వైపు ఎత్తకూడదు, అటూ ఇటూ చూడకూడదు.

నమాజు ఎలా చేయాలో పూర్తిగా తెలుసుకోవడానికి బార్ కోడ్ స్కాన్ చేయండి.

4 దుఆ ఏ ఇస్తిఫ్'తాహ్ (నమాజు ప్రారంభ దుఆ): ఇస్తిఫ్'తాహ్ దుఆలలో ఒక దుఆను చదువుతాము. అందులో ఒకటి: "అల్లాహుమ్మ బాఇద్ బైనీ వ బైన ఖతాయాయ కమా బాఅత్త బైనల్ మష్రిఖి వల్ మగ్రిబి, అల్లహుమ్మ నక్కిని మినల్ ఖతాయాయ కమా యునక్ఖస్ సౌబుల్ అబ్యదు మినద్దనస్, అల్లాహుమ్మగ్ సిల్'నీ మిన్ ఖతాయాయ బిస్సల్'జి వల్ మాఇ వల్ బరది.

"ఓ అల్లాహ్! తూర్పుకు, పడమరకు మధ్య దూరం ఎంత ఉన్నదో, అంత దూరం నాకు, నా పాపాలకు మధ్య ఉంచు. ఓ అల్లాహ్! తెల్లటి వస్త్రం నుండి మలినాలను ఎలా తొలగిస్తారో, అలాగే నా పాపాల నుండి నన్ను పరిశుభ్రం చేయి. ఓ అల్లాహ్! మంచు, నీరు, వడగళ్ళతో నా పాపాల నుండి నన్ను కడిగివేయి."

5 ఇస్తిఆజా: "అఊదు బిల్లాహి మినష్షైతా నిర్రజీం" (నేను బహిష్కరించబడిన షైతాన్ నుండి అల్లాహ్ తో శరణు కోరుకుంటున్నాను) అని అంటాము.

6 ఫాతిహా పఠనం: ఫాతిహా సూరాను అణకువతో, ప్రశాంతతతో పఠిస్తాము. సూరా ఫాతిహాలో గొప్ప వేడుకోళ్ళు ఉన్నాయి. కాబట్టి దాని తర్వాత "ఆమీన్" అని అంటాము. దీని అర్థం: "ఓ అల్లాహ్! దీనిని స్వీకరించు". ఇది ఫాతిహాలోని ఆయత్ యొక్క భాగం కాదు.

7 ఖుర్ఆన్ నుండి వీలైనంత పఠించడం: ఫాతిహా తర్వాత ఒక పూర్తి సూరా లేదా దానిలోని కొంత భాగాన్ని పఠిస్తాము.

8 రుకూ:

A. మన చేతులను భుజాల ఎముకల వరకు లేదా చెవుల వరకు పైకెత్తుతాము. నిలబడి ఉన్న స్థానం నుండి రుకూ లోకి వంగుతున్నప్పుడు “అల్లాహు అక్బర్” అని అంటాము.

B. మన అరచేతులను మోకాళ్ళపై ఉంచుతాము. మన వేళ్ళను విడదీసి, మోకాళ్ళపై స్థిరంగా ఉంచుతాము. అది మోకాళ్ళను పట్టుకున్నట్లుగా ఉంటుంది.

C. మనం రుకూలో ప్రశాంతంగా ఉంటాము, వీపును వంచకుండా నిటారుగా ఉంచుతాము, తలను వీపుతో సమానంగా ఉంచుతాము, తలను పైకి ఎత్తము లేదా కిందకు వంచము.

D. రెండు చేతులను పక్కలకు దూరంగా ఉంచుతాము, మరియు ఆ స్థితిలో తలను పక్కకు వంచి చెంప బహిర్గతం అయ్యేటట్లు ఒకవైపు వంచము.

E. “సుబ్హాన రబ్బియల్ అదీమ్” అని మూడు సార్లు అంటాము - ఇది కనీస పరిపూర్ణత - మనం తలచుకుంటే ఎక్కువ సార్లు కూడా చెప్పవచ్చు. ఒక సారి కూడా సరిపోతుంది. రుకూలో చదవగల అనేక స్మరణలు(దిక్ర్)లు ఉన్నాయి.

9 **రుకూ నుండి లేవడం:** రుకూ నుండి తలను పైకెత్తుతాము. మన చేతులను భుజాల ఎముకల వరకు లేదా చెవుల వరకు పైకెత్తుతాము. నమాజు చేసే వ్యక్తి ఒంటరిగా ఉన్నా లేదా ఇమామ్ అయి ఉన్నా, "సమిఅల్లాహు లిమన్ హమిదహ్" (తనను స్తుతించిన వారిని అల్లాహ్ వింటాడు) అని అంటాడు.

రుకూ నుండి లేచిన తర్వాత మన చేతులను వదులుగా వదిలేయవచ్చు లేదా కట్టుకోవచ్చు.

10 **రుకూ నుండి నిలబడటం:** "రబ్బనా వ లకల్ హమ్ద్" (ఓ మా ప్రభూ! ప్రశంస నీకే) అంటూ నిటారుగా నిలబడతాము.

రుకూ తర్వాత నిలబడటాన్ని పొడిగించడం, ఆ స్థితిలో ప్రశాంతంగా ఉండటం అనేది సున్నతు.

11 సజ్దా:

- (A) "అల్లాహు అక్బర్" అంటూ నేలపై సాష్టాంగం చేస్తాము.
- (B) మోకాళ్ళకు ముందు చేతులను నేలపై ఉంచుతాము లేదా చేతులకు ముందు మోకాళ్ళను నేలపై ఉంచుతాము. మనకు ఏది సులభమో అలా చేస్తాము.
- (C) సాష్టాంగం(సజ్దా) సమయంలో మన ఏడు అంగాలు నేలను తాకుతాయి. అవి :

- వీటిలో దేనిలోనూ నిర్లక్ష్యం వహించకూడదు.

D సజ్దాలో చేతుల వేళ్ళను ఖిబ్లా వైపు ఉంచి, అరచేతులను భుజాల ఎముకల వరకు లేదా చెవుల వరకు ఉంచుతాము. చేతులను నేల నుండి పైకెత్తి ఉంచుతాము.

E జమాత్ తో నమాజు చేస్తున్నప్పుడు, చుట్టూ ఉన్నవారికి ఇబ్బంది కలిగించే అవకాశం ఉంటే తప్ప, చేతులను శరీరానికి దూరంగా ఉంచుతాము.

F ఈ సజ్దా స్థితిలో పాదాల వేళ్ళను ఖిబ్లా వైపు ఉంచుతాము. కాళ్ళను నిటారుగా ఉంచుతాము. తొడలను విడదీసి, వాటి నుండి పొట్టను దూరంగా ఉంచుతాము.

G "సుబ్హాన రబ్బియల్ అ'లా" అని మూడు సార్లు అంటాము – మూడు సార్లు చెప్పడం అనేది కనీస పరిపూర్ణత - మనం కోరుకుంటే ఎక్కువ చేయవచ్చు. ఒక తస్బీహ్ కూడా సరిపోతుంది. వివిధ రకాల తస్బీహ్ లను చదవవచ్చు.

H ఇహలోక, పరలోక శ్రేయస్సుకు చెందిన మనకు నచ్చిన దుఆలను చదవవచ్చు.

12 **సజ్దా నుండి లేవడం:** "అల్లాహు అక్బర్" అంటూ సజ్దా నుండి తలను పైకెత్తి, రెండు సజ్దాల మధ్య కూర్చుంటాము.

13 రెండు సజ్దాల మధ్య కూర్చోవడం:

A ఈ స్థితిలో ఎడమ పాదాన్ని పరచి, దానిపై ప్రశాంతంగా కూర్చోవాలి. కుడి పాదాన్ని నిటారుగా ఉంచి, దాని వేళ్ళను ఖిబ్లా దిశగా మడచాలి . లేదా రెండు పాదాలను నిటారుగా ఉంచి, మడమలపై కూర్చోవచ్చు.

B రెండు చేతులను చాచి కుడి చేతిని కుడి తొడపై, ఎడమ చేతిని ఎడమ తొడపై మోకాలి దగ్గర లేదా మోకాలిపై ఉంచాలి.

C ఆ సమయంలో "రబ్బిగ్ఫిర్ లీ, రబ్బిగ్ఫిర్ లీ" అని అనాలి.(ఓ అల్లాహ్ నను మన్నించు, ఓ అల్లాహ్ నను మన్నించు).

14 ఆ తరువాత "అల్లాహు అక్బర్" అంటూ రెండవ సాష్టాంగం చేస్తాము. ఇది మొదటి సజ్దా లాగానే ఉంటుంది.

15 సజ్దా నుండి లేవడం: ఆ తరువాత "అల్లాహు అక్బర్" అంటూ సజ్దా నుండి లేచి నిలబడతాము.

16 **రెండవ రెకాతు:** మొదటి రెకాతు ఎలా చేశామో, అలాగే రెండవ రెకాతు ను కూడా చేస్తాము.

- చేతులను ఛాతీపై ఉంచుతాము, సూరా ఫాతిహ్ పఠిస్తాము, ఆ తరువాత ఏదైనా ఒక సూరా లేదా దానిలోని కొంత భాగాన్ని పఠిస్తాము.
- తర్వాత తక్బీర్ చెప్పి రుకూ చేస్తాము, తస్బీహ్ (సుబ్హాన రబ్బియల్ అజీమ్) చదువుతాము.
- తర్వాత రుకూ నుండి లేచి నిలబడతాము, “సమిఅల్లాహు లిమన్ హమిదహ్” అని అంటాము.
- తర్వాత నిటారుగా నిలబడి, “రబ్బనా వ లకల్ హమ్ద్” అని అంటాము.
- తర్వాత తక్బీర్ చెప్పి సాష్టాంగపడతాము, తస్బీహ్ చదువుతాము.
- తర్వాత తక్బీర్ చెప్పి కూర్చుంటాము, “రబ్బిగ్ఫిర్ లీ” అని వేడుకుంటాము .
- తర్వాత తక్బీర్ చెప్పి సాష్టాంగపడతాము, తస్బీహ్ చదువుతాము.

17 మొదటి తషహ్హుద్:

A “అల్లాహు అక్బర్” అంటూ సజ్దా నుండి లేచి, తషహ్హుద్ కోసం కూర్చుంటాము. రెండు సజ్దాల మధ్య ఎలా కూర్చున్నామో, అలాగే కూర్చుంటాము.

B కుడి చేతిని కుడి తొడపై ఉంచుతాము. చూపుడు వేలు తప్ప అన్ని వేళ్ళను ముడివేస్తాము. చూపుడు వేలును ఖిబ్లా వైపు చూపిస్తాము. లేదా బొటనవేలు, మధ్య వేలును కలిపి, చూపుడు వేలును చూపిస్తాము. ఎడమ చేతిని ఎడమ తొడపై చాచవచ్చు లేదా మోకాలిపై కప్పి ఉంచవచ్చు.

C తషహ్హుద్ స్థితిలో ఉన్నపుడు చూపుడు వేలు వైపు చూస్తాము.

D తషహ్హుద్ లో మనం ఇది చదువుతాము. “అత్తహియాతు లిల్లాహి వస్సలవాతు వత్తయ్యిబాతు. అస్సలాము అలైక అయ్యుహన్నబియ్యు వ రహ్మతుల్లాహి వ బరకాతుహు. అస్సలాము అలైనా వ అలా ఇబాదిల్లాహిస్సాలిహీన్. అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు. వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహు వ రసూలుహు.” (సమస్త శరీర సంబంధమైన, ధన సంబంధమైన మరియు నోటి సంబంధమైన ఆరాధనలు అల్లాహ్ కు మాత్రమే చెందుతాయి. ఓ ప్రవక్తా! మీపై అల్లాహ్ యొక్క శాంతి, కరుణ మరియు ఆశీర్వాదాలు కురవాలి. మాపై మరియు సత్పురుషులైన అల్లాహ్ దాసులందరిపై కూడా అవి కురువాలి. అల్లాహ్ తప్ప ఆరాధించదగిన వేరొక దైవం లేదని నేను సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్ (స) అల్లాహ్ యొక్క దాసుడు మరియు సందేశహరుడు అని నేను సాక్ష్యమిస్తున్నాను)

18 తషహ్హుద్ నుండి లేవడం: మూడవ రకాతుల కోసం నిలబడతాము. చేతులను భుజాల ఎముకల వరకు లేదా చెవుల వరకు పైకెత్తి, "అల్లాహు అక్బర్" అని అంటాము. మొదటి రెకాతు ఎలా చేశామో, అలాగే ఈ రెకాతును కూడా చేస్తాము. కానీ ఫాతిహా మాత్రమే పఠిస్తాము.

- తర్వాత తక్బీర్ చెప్పి రుకూ చేస్తాము, తస్బీహ్ (సుబ్హాన రబ్బియల్ అదీం - నా మహోన్నత ప్రభువు పరిశుద్ధుడు) చదువుతాము.
- తర్వాత రుకూ నుండి లేచి నిలబడతాము, "సమిఅల్లాహు లిమన్ హమిదహ్" అని అంటాము.
- తర్వాత నిటారుగా నిలబడి, 'రబ్బనా వ లకల్ హమ్ద్' (ఓ మా ప్రభువా! సర్వ ప్రశంసలు నీకే) అని అంటాము.
- తర్వాత తక్బీర్ చెప్పి సజ్దాకు సాష్టాంగపడతాము, తస్బీహ్ ('సుబ్ హాన రబ్బీ అల్ ఆలా'-నా ప్రభువు, మహోన్నతుడు, ఆయన పరిశుద్ధుడు) చదువుతాము.
- తర్వాత తక్బీర్ చెప్పి కూర్చుంటాము, "రబ్బిగ్ఫిర్ లీ (నా ప్రభూ! నన్ను క్షమించు) అని అంటాము.
- తర్వాత తక్బీర్ చెప్పి సజ్దాకు సాష్టాంగపడతాము, తస్బీహ్ (సుబ్ హాన రబ్బీ అల్ ఆలా') చదువుతాము.

19 సజ్దా నుండి లేవడం: "అల్లాహు అక్బర్" అంటూ సజ్దా నుండి లేచి నిలబడతాము. రెండవ రెకాతు ఎలా చేశామో, అలాగే నాలుగవ రెకాతు ను కూడా చేస్తాము. కానీ ఫాతిహా సూరా మాత్రమే పఠిస్తాము.

- తర్వాత తక్బీర్ చెప్పి రుకూ చేస్తాము, తస్బీహ్ (సుబ్హాన రబ్బియల్ అదీం) చదువుతాము.
- తర్వాత రుకూ నుండి లేచి నిలబడతాము, "సమిఅల్లాహు లిమన్ హమిదహ్ " అని అంటాము.
- తర్వాత నిటారుగా నిలబడి, "రబ్బనా వ లకల్ హమ్ద్" అని అంటాము.
- తర్వాత తక్బీర్ చెప్పి సజ్దాకు సాష్టాంగపడతాము, తస్బీహ్ చదువుతాము.
- తర్వాత తక్బీర్ చెప్పి కూర్చుంటాము, "రబ్బిగ్ఫిర్ లీ" అని చదువుతాము.
- తర్వాత తక్బీర్ చెప్పి సజ్దాకు సాష్టాంగపడతాము, తస్బీహ్ చదువుతాము.

20 చివరి తషహ్హుద్:

A. "అల్లాహు అక్బర్" అంటూ సజ్దా నుండి లేచి, తషహ్హుద్ కోసం కూర్చుంటాము.

B. మనం ఎడమ తుంటిపై కూర్చుంటాము, కుడి కాలిని నిటారుగా పెట్టి ఎడమ పాదాన్ని నేలపై ఆనించి ఉంచుతాము, మరియు ఎడమ కాలిని కుడి కాలు కింద నుండి బయటకు తీస్తాము.

C. తషహ్హుద్ లో "అత్తహియాతు లిల్లాహ్..." చివరి వరకు చదువుతాము. తర్వాత దరూదే (దరూద్ అంటే దీవించడం) ఇబ్రాహీమీ చదువుతాము: "అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వ అలా ఆలి ముహమ్మదిన్ కమా సల్లెత అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదున్ మజీద్. అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్ వ అలా ఆలి ముహమ్మదిన్ కమా బారక్త అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదున్ మజీద్." (ఓ అల్లాహ్! నీవు ముహమ్మద్ మరియు ముహమ్మద్ కుటుంబీకులపై శాంతిని కురిపించు ఎలాగైతే నీవు ఇబ్రాహీం మరియు ఇబ్రాహీం కుటుంబీకులపై శాంతిని కురిపించావో, నిస్సందేహంగా నీవే సకల స్తోత్రాలకు అర్హుడవు, గొప్ప ఘనత గలవాడవు. ఓ అల్లాహ్! నీవు ముహమ్మద్ మరియు ముహమ్మద్ కుటుంబీకులపై శుభాలు కురిపించు. ఎలాగైతే నీవు ఇబ్రాహీం మరియు ఇబ్రాహీం కుటుంబీకులపై శుభాలు కురిపించావో, నిస్సందేహంగా నీవే సకల స్తోత్రాలకు అర్హుడవు, గొప్ప ఘనత గలవాడవు)

తర్వాత సాధ్యమైనంతవరకు దుఆలను చదవడం అనేది సున్నతు. ఉదాహరణకు: "అల్లాహుమ్మ ఇన్నీ అవూజు బిక మిన్ అజాబి జహన్నమ. వ మిన్ అజాబిల్ ఖబ్రి. వ మిన్ ఫిత్నతిల్ మహ్యా వల్ మమాతి. వ మిన్ షర్రి ఫిత్నతిల్ మసీహిద్ దజ్జాల్."(ఓ అల్లాహ్! నరకం యొక్క శిక్ష నుండి, సమాధి యొక్క శిక్ష నుండి, జీవితం మరియు మరణం యొక్క కష్టాల నుండి, మరియు దజ్జాల్ యొక్క కీడు నుండి నేను నీ శరణు కోరుతున్నాను)

ఇహలోక, పరలోక శ్రేయస్సు కోసం మనకు నచ్చిన దుఆలను చదువుతాము.

21 ముగింపు సలాం: "అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్" అంటూ కేవలం ముఖాన్ని కుడి వైపుకు తిప్పుతాము. తర్వాత "అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్" అంటూ ముఖాన్ని ఎడమ వైపుకు తిప్పుతాము. దీనితో మన నమాజు పూర్తవుతుంది.

22 సలాం చెప్పిన తర్వాత కొద్దిసేపు కూర్చోవడం సున్నతు. అల్లాహ్ ను మూడు సార్లు క్షమాపణ (ఇస్తిగ్ఫార్) కోరుతాము. తర్వాత దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నుండి నిరూపితమైన స్మరణలతో అల్లాహ్ ను స్మరిస్తాము.

రెండు రెకాతుల, మూడు రెకాతుల నమాజు ఎలా చేయాలి?

A ఫజ్ర్ నమాజు లాగా రెండు రెకాతుల నమాజు అయితే, రెండవ రెకాతు లోని రెండు సజ్దాల తర్వాత తషహ్హుద్ కోసం కూర్చుంటాము. "అత్తహియ్యాతు లిల్లాహ్..." అని చివరి వరకు చదువుతాము. తర్వాత దరూద్ ఇబ్రాహీమి చదువుతాము. తర్వాత సలాంతో ముగిస్తాము.

B మగ్రిబ్ నమాజు లాగా మూడు రెకాతుల నమాజు అయితే, మూడవ రెకాతులోని రెండు సజ్దాల తర్వాత తషహ్హుద్ కోసం కూర్చుంటాము. "అత్తహియాతు లిల్లాహ్..." చివరి వరకు చదువుతాము. తర్వాత దరూద్ ఇబ్రాహీమ్ చదువుతాము. తర్వాత సలాం చెప్తాము.

గమనికలు:

1 రెండు రకాతుల నమాజులలో చివర్లో కూర్చునేటప్పుడు (తషహ్హుద్), ఎడమ పాదాన్ని నేల మీద పరచి, కుడి పాదాన్ని నిలబెట్టుకుని కూర్చోవాలి. ఉదాహరణకు, ఫజ్ర్, జుమా, ఈద్ నమాజ్ లలో ఇలాగే కూర్చోవాలి. మూడు, నాలుగు రకాతుల నమాజ్ లో మొదటిసారి కూర్చునేటప్పుడు (మొదటి తషహ్హుద్), మరియు రెండు సజ్దాల మధ్య కూర్చునేటప్పుడు కూడా ఇలాగే కూర్చోవాలి.

2 మూడు, నాలుగు రకాత్ ల నమాజ్ లో చివరిసారి కూర్చునేటప్పుడు (చివరి తషహ్హుద్), మనం ఎడమ తుంటిపై కూర్చుంటాము, కుడి కాలిని నిటారుగా పెట్టి ఎడమ పాదాన్ని నేలపై ఆనించి ఉంచుతాము, మరియు ఎడమ కాలిని కుడి కాలు కింద నుండి బయటకు తీస్తాము.

3 ఎవరైనా శరీర బరువు కారణంగా, లేదా కాళ్ళలో నొప్పి వల్ల, లేదా ఇతర కారణాల వల్ల ఇఫ్తిరాష్ (ఎడమ పాదాన్ని నేలపై పరచి, కుడి పాదాన్ని నిటారుగా ఉంచి కూర్చోవడం.) లేదా తవర్రుక్ (ఎడమ తుంటిపై కూర్చొని, కుడి పాదాన్ని నిటారుగా ఉంచి, ఎడమ పాదాన్ని నేలపై ఆనించి, కుడి కాలు కింద నుండి బయటకు తీయాలి.) విధంగా కూర్చోలేకపోతే, వారు తమకు వీలైన ఏ విధంగానైనా కూర్చోవచ్చు, దానిలో ఎటువంటి తప్పు లేదు.

నమాజును భంగపరిచేవి :

1. నమాజు యొక్క ఏదైనా షరతును ఉద్దేశపూర్వకంగా విడిచిపెట్టడం.
2. నమాజు యొక్క ఏదైనా రుక్న్ (మూలస్థంబం) ను ఉద్దేశపూర్వకంగా లేదా పొరపాటున విడిచిపెట్టడం.
3. నమాజు యొక్క ఏదైనా వాజిబ్ (ముఖ్య అంశము)ను ఉద్దేశపూర్వకంగా విడిచిపెట్టడం.
4. అవసరం లేకుండా ఉద్దేశపూర్వకంగా ఎక్కువ కదలికలు చేయడం, మాట్లాడటం, నడవడం.
5. నవ్వడం, గట్టిగా నవ్వడం.
6. ఉద్దేశపూర్వకంగా తినడం, త్రాగడం.

నమాజులో మరచిపోవడం, పొరపాటున ఏదైనా చేయడం వంటి వాటికి సంబంధించిన నియమాలను ఒక ముస్లిము తప్పక నేర్చుకోవాలి.

నమాజులో మక్రూహ్ (తగనివి, అయిష్టమైనవి) అయినవి:

కొన్ని పనులు నమాజును భంగం చేయవు, కానీ అవి నమాజులో మక్రూహ్(అయిష్టమైనవి) కాబట్టి వాటిని చేయకూడదు. అవి:

1. నమాజు లో ముఖాన్ని తిప్పడం.
2. శరీరంలోని ఏదైనా భాగాన్ని ఆడించడం, వెళ్ళు విరవడం, చేతుల వేళ్ళను కలిపి ఉంచడం.
3. నమాజు నుండి దృష్టి మరల్చే వస్తువు వైపు నమాజు చేయడం.
4. మలమూత్ర విసర్జన అవసరం ఉన్నప్పుడు వాటిని నొక్కిపెట్టి ఉంచి నమాజు చేయడం.
5. ఫర్ద్ నమాజు లోని మొదటి రెండు రెకాతు లలో ఫాతిహా మాత్రమే చదవడం.
6. ఆహారం వడ్డించబడి సిద్ధంగా ఉన్నపుడు నమాజు చేయడం.
7. నమాజు లో దుస్తులను పైకి మడవడం.

ఇతరములు

అనారోగ్యగ్రస్తుని నమాజు:

ఫర్జ్ నమాజులు ప్రతి స్పృహలో ఉన్న, యుక్తవయస్సు కలిగి ఉన్న ముస్లిముపై విధిగా ఉంటాయి. ఋతుస్రావం, ప్రసవ సమయ స్రావం (పురుడు రక్తం) ఉన్న స్త్రీలు తప్ప.

ఎల్లప్పుడూ వీటిని నిర్వర్తించడం ప్రతి ముస్లిముకు తప్పనిసరి

కానీ ఒక ముస్లిము అనారోగ్యానికి గురై, నమాజు చేయడం కష్టమైతే, అతను ఏమి చేయాలి?

అల్లాహ్ తన దయ, కరుణ వల్ల ఆయన ఏ వ్యక్తిపై అతని శక్తికి మించి భారం వేయడు. కాబట్టి ఒక ముస్లిము అనారోగ్యానికి గురై, నమాజులో నిలబడలేకపోతే అతనిపై నిలబడి నమాజు చేయడం అనేది తప్పనిసరి కాదు. అతను కూర్చుని కూడా నమాజు ఆచరించవచ్చు. నమాజుకు చెందిన అన్ని నియమాలు శక్తి మేరకు పాటించాలి. రుకూ, సజ్దా చేయలేకపోతే, వాటిని సూచనలతో ఆచరిస్తాడు(అంటే, వీలైనంత వరకు వంగుతాడు. సజ్దాలో రుకూ కంటే ఎక్కువగా వంగుతాడు). రుకూ చేయగలిగి, సజ్దా చేయలేకపోతే లేదా దీనికి విరుద్ధంగా ఉంటే, అతను చేయగలిగినది చేస్తాడు, చేయలేని దానిని సంజ్ఞతో సూచిస్తాడు.

కూర్చొని కూడా నమాజు చేయలేని పరిస్థితిలో, వీలైనంత వరకు ఖిబ్లా వైపు ముఖం చేసి పడుకుని ఉన్న స్థితిలో నమాజు చేయవచ్చు. రుకూ మరియు సజ్దా చేసేటప్పుడు శరీరాన్ని కొద్దిగా వంచి సంజ్ఞ చేయాలి.

పడుకుని కూడా నమాజు చేయలేకపోతే, కాళ్ళు ఖిబ్లా వైపు ఉంచి, పడుకుని నమాజు చేయవచ్చు. వీలైతే తలను పైకెత్తాలి. రుకూ మరియు సజ్దాలను తలతో సూచించాలి.

సూచించడం కూడా చేయలేకపోతే, సూచించడం అతనిపై నుండి తొలగించబడుతుంది. రుకూ, సజ్దా లను తన హృదయంలో సంకల్పించుకుంటూ చేసుకుంటాడు.

రోగి యొక్క నమాజు లోని నియమం:

వాజిబ్ లలో అతను చేయగలిగినది చేస్తాడు. లేదా దానిలో అతను చేయగలిగినంత చేస్తాడు. అతను చేయలేనిది అతని మినహాయింపు ఉంటుంది.

ప్రయాణికుడి నమాజు:

ఇస్లాంలోని సరళతకు ఉదాహరణల్లో ఒకటి ప్రయాణికులకు నమాజులో ఇవ్వబడిన సడలింపు. నాలుగు రకాతుల నమాజులను అనగా దుహర్, అసర్, ఇషా నమాజులలో రెండు రకాతులకు కుదించి చదవడానికి అనుమతి ఉంది. అంటే, ఈ మూడు నమాజ్ లలో ప్రతిదాన్ని రెండు రకాత్ లు మాత్రమే చదవాలి.

స్త్రీలకు సంబంధించిన నమాజు నియమాలు:

నమాజు నియమాలలో స్త్రీలు, పురుషులు ఇరువురూ సమానమే. కానీ కొన్ని నియమాలు స్త్రీలకు మాత్రమే వర్తిస్తాయి. అవి:

- ఋతుస్రావం, ప్రసవ సమయంలో స్త్రీలకు నమాజు నుండి మినహాయింపు ఉంటుంది. తర్వాత వాటిని పూర్తి చేయవలసిన అవసరం ఉండదు.
- స్త్రీలకు జుమా నమాజు విధిగా లేదు.
- స్త్రీలు ఫర్జ్ నమాజులను సామూహికంగా చేయవలసిన అవసరం లేదు.
- నమాజులో స్త్రీలు ముఖం, అరచేతులు తప్ప శరీరమంతా కప్పి ఉంచాలి.

ముగింపు:

అల్లాహ్ మనల్ని, మన సోదర సోదరీమణులను ఇస్లాం యొక్క ఈ గొప్ప కీలక ఆచరణను ఆయనకు సంతుష్టకరమైన రీతిలో నెలకొల్పేలా దీవించుగాక అని వేడుకుందాము. ఆయన ప్రియ మిత్రుడు ఇబ్రాహీం (అలైహిస్సలాం) చేసిన దుఆతో మనం కూడా దుఆ చేస్తున్నాము: "(ఓ నా ప్రభూ!) నన్ను, నా సంతానాన్ని నమాజు ను స్థాపించేవారిగా చేయి. ఓ మా ప్రభూ! నా వేడుకోలును స్వీకరించు." (ఇబ్రాహీం:40)

అంతిమంగా, అల్లాహ్ కే అన్ని విషయాలు బాగా తెలుసు. అల్లాహ్ యొక్క అనుగ్రహం, శాంతి, ఆశీస్సులు ఆయన దాసుడు, దైవప్రవక్త అయిన ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) పై కురియుగాక.

అభ్యాస ప్రశ్నలు

1 సరైనది లేదా తప్పు అని గుర్తించండి:

- [ ] నమాజు అనేది దాసుడికి, అతడి ప్రభువుకు మధ్య ఉన్న సంబంధం. నమాజులో మనిషి అల్లాహ్ ఎదుట ఆయన ముందు గౌరవభావం మరియు భయభక్తులతో నిలబడతాడు.
- [ ] అణకువ(ఖుషూ) విషయంలో నిర్లక్ష్యం వహిస్తే నమాజు యొక్క ప్రతిఫలం తగ్గుతుంది.
- [ ] నమాజు అనేది ప్రతి ముస్లిముపై విధిగా ఉంటుంది. అతను పాపి అయినా, అపరాధాలు చేసుకుని ఉన్నా సరే.
- [ ] ఖిబ్లా అంటే మక్కా దిశ.
- [ ] నియ్యత్(సంకల్పం) లేకుండా కూడా ముస్లిము యొక్క నమాజు చెల్లుతుంది.
- [ ] ఫాతిహా పఠనం అనేది ఒక మూల స్థంబం(రుక్న్). దానిని చదవగలిగే వారికి అది లేకుండా నమాజు చెల్లదు.
- [ ] నమాజు ప్రతి స్పృహలో ఉన్న, యవ్వన ముస్లింపై విధి చేయబడి ఉన్నది. ఋతుస్రావం, ప్రసవ సమయంలో ఉన్న స్త్రీలు తప్ప.
- [ ] ప్రయాణికుడికి నాలుగు రెకాతుల నమాజును రెండు రెకాతులకు కుదించడం(కసర్ చేయడం) ధర్మబద్ధం.

☐ జుమా నమాజు మరియు సామూహిక (జమాత్) నమాజు స్త్రీలకు విధిగా లేవు.

☐ నిలబడలేని వారు కూర్చుని నమాజు చేయవచ్చు.

☐ నమాజులో ముఖాన్ని తిప్పవచ్చు.

☐ నమాజులో మాట్లాడటం లేదా తినడం చెల్లుతుంది.

☐ ఖిబ్లా దిశ గురించి తెలుసుకోవడానికి లేదా అడగడానికి అవకాశం ఉన్న వ్యక్తి ఖిబ్లా దిశ కాకుండా వేరే దిశలో నమాజు చేస్తే అతని నమాజు చెల్లుతుంది.

☐ సజ్దా చేసేటప్పుడు పాదాల వేళ్ళను నేల నుండి పైకెత్తితే సజ్దా చెల్లదు.

అభ్యాస ప్రశ్నలు

2 నమాజు యొక్క మొదటి రెకాతులలో రెండు సజ్దాలలో ఒకదాన్ని మరచిపోయి, రెండవ రెకాతులో గుర్తుకు వస్తే, మొదటి రెకాతు ఒక సజ్దాతో చెల్లుతుందా? ఎందుకంటే ఆ వ్యక్తి మరచిపోయాడు.

☐ అవును ☐ కాదు

3 సరైన సమాధానాలను ఎంచుకోండి:

1. పగలు, రాత్రిలో ముస్లిముపై విధిగా ఉన్న నమాజులు:

☐ ఏడు ☐ ఐదు ☐ పది

2. నమాజు చెల్లుబాటు కావడానికి గల షరతులు:

☐ శుద్ధత ☐ నియ్యత్ (సంకల్పం)

☐ ఖిబ్లా వైపు తిరగడం ☐ పైన చెప్పినవన్నీ

3. రుకూలో చదవవలసిన దుఆలలో ఒకటి:

☐ సుబ్హాన రబ్బియల్ అలా

☐ సుబ్హాన రబ్బియల్ అదీమ్

☐ అల్హందు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్

4. తషహ్హుద్ నుండి లేచిన తర్వాత మనం ఏమి చేస్తాము:

☐ తక్బీర్ చెప్పి నిలబడతాము, ఫాతిహా పఠిస్తాము, తర్వాత రుకూ చేస్తాము.

☐ తక్బీర్ చెప్పి సజ్దా చేస్తాము.

5. మలమూత్ర విసర్జన అవసరం ఉన్నప్పుడు నమాజు చేస్తే, ఆ నమాజు యొక్క నియమం ఏమిటి?

☐ మక్రూహ్ (అయిష్టమైన)

☐ హరామ్ (నిషిద్ధం)

☐ జాయిజ్ (సమ్మతి కలిగినది)

అభ్యాస ప్రశ్నలు

4 కింది వాటిని పూర్తి చేయండి:

1. షహాదా తర్వాత అత్యుత్తమ ఆరాధన ....
2. మగ్రిబ్ నమాజు .... రకాతులు దుహర్ నమాజు .... రకాతులు.
3. నమాజు ను తక్బీర్ తో ప్రారంభిస్తాము .... తో ముగిస్తాము.
4. నమాజులో స్త్రీలు .... మరియు .... తప్ప శరీరమంతా కప్పి ఉంచాలి.

5 నమాజు యొక్క మూడు ప్రయోజనాలను తెలపండి?

....

....

6 నమాజు యొక్క ప్రాముఖ్యతకు ఒక ఋజువు తెలపండి?

....

....

....

7 చివరి తషహ్హుద్ ఎలా చదువుతారో తెలపండి

....

....

....

8 రెండు సజ్దాల మధ్య చదవవలసిన దుఆ ఏమిటి?

....

9 సజ్దాలో చదవవలసిన దుఆ ఏమిటి?

....

10 నమాజు లో అణకువ(ఖుషూ) సాధించడానికి సహాయపడే నాలుగు పద్ధతులను తెలపండి?

....

11 విధిగా ఉన్న నాలుగు రెకాతుల నమాజులు ఏవి?

....

12 ఒక వ్యక్తి కుర్చీపై కూర్చుని నమాజు చేశాడు, ఎందుకంటే అతను అది లేకుండా కూర్చోలేడు. అతని నమాజు చెల్లుతుందా?

....

13 మొదటి తషహ్హుద్ ను ఉద్దేశపూర్వకంగా విడిచిపెడితే, ఆ నమాజు యొక్క నియమం ఏమిటి?

....

నమాజు-
ఒక గొప్ప ఆరాధన

ముస్లిములు పగలు, రాత్రిలో ఐదుసార్లు ఈ నమాజును విధిగా ఆచరిస్తారు. వారికి శక్తి ఉన్నంత వరకు వారు దానిని విడిచిపెట్టరు. దాని కోసం వారు నిద్రను, పనిని కూడా మానుకుంటారు. ఇది చిన్న పిల్లవాడు భయపడినప్పుడు తన తల్లి ఒడిలోకి ఆశ్రయించినట్లు ఉంటుంది. అల్లాహ్ యొక్క ఏకత్వం(తౌహీద్) తర్వాత ఒక ముస్లిము నేర్చుకోవలసిన, నేర్పించాల్సిన అత్యంత ముఖ్యమైన విషయం ఇది.

ఈ పుస్తకంలో ప్రారంభం నుండి చివరి వరకు నమాజు ఎలా చేయాలో వివరించబడినది. దానికి సంబంధించిన కొన్ని నియమాలు కూడా ఇందులో ఉన్నాయి.

నమాజు ఎలా చేయాలో వీడియో ద్వారా కూడా చూడవచ్చు. ఈ బార్ కోడ్ స్కాన్ చేయండి.



ربَّنا ولكَ الحمدُ
حمدًا كثيرًا طيِّبًا مُبارَكًا فيه
4:25 / 13:42

مركز أصول
Osoul Center

CHAT & DECIDE

ఇస్లాం గురించి వివిధ భాషల్లో చర్చించు

GUIDE TO ISLAM

ఇస్లాం గురించి మరింత తెలుసుకోవడానికి

ముస్లిములు పగలు, రాత్రిలో ఐదుసార్లు ఈ నమాజును విధిగా ఆచరిస్తారు. వారికి శక్తి ఉన్నంత వరకు వారు దానిని విడిచిపెట్టరు. దాని కోసం వారు నిద్రను, పనిని కూడా మానుకుంటారు. ఇది చిన్న పిల్లవాడు భయపడినప్పుడు తన తల్లి ఒడిలోకి ఆశ్రయించినట్లు ఉంటుంది. అల్లాహ్ యొక్క ఏకత్వం(తౌహీద్) తర్వాత ఒక ముస్లిము నేర్చుకోవలసిన, నేర్పించాల్సిన అత్యంత ముఖ్యమైన విషయం ఇది.

ఈ పుస్తకంలో ప్రారంభం నుండి చివరి వరకు నమాజు ఎలా చేయాలో వివరించబడినది. దానికి సంబంధించిన కొన్ని నియమాలు కూడా ఇందులో ఉన్నాయి.

నమాజు ఎలా చేయాలో వీడియో ద్వారా కూడా చూడవచ్చు. ఈ బార్ కోడ్ స్కాన్ చేయండి.

osoulcenter

www.osoulcontent.org.sa

9001

ఈ పుస్తకాన్ని మరియు ఇతర పుస్తకాలను
ఒసుల్ స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చును

OSOUL STORE

osoulstore.com